క్లుప్తంగా

బాధితురాలికి న్యాయం చేయాలి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లిలో జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి దళిత బాలికకు మద్దతుగా నినాదాలు చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ గిరిధర్‌నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు న్యాయవాది శివరామకృష్ణ, రవికుమార్, నాగరాజు, వెంకటేషులు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్‌జెన్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని గ్లోబల్‌జెన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఎం.స్ఫూర్తి, తనుశ్రీ, సాయిప్రణీత, శ్లోక అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం వారిని అభినందించింది.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయొద్దు



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

చిలమత్తూరు: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయొద్దంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి రామచంద్ర, సుధాకర్, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

40 గ్రాముల బంగారం రికవరీ

అగళి: మడకశిర పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీల ఘటనలకు సంబంధించి దొంగను నుంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం శిర తాలూకా పట్టనాయకనహళ్లికి చెందిన రోషన్ (33) మడకశిర తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడన్నారు. సోమవారం ముత్తేపల్లి బస్టాప్ దగ్గర అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. రొళ్ల మండలం హుళికుంట లక్ష్మమ్మకు చెందిన 30 గ్రాముల బంగారం, అగళి మండల పరిధిలోని మధుడికి చెందిన తిమ్మక్కకు చెందిన 10 గ్రాముల బంగారం గతంలో చోరీ జరిందన్నారు. ఆ ఆభరణాలను రికవరీ చేశామన్నారు. నిందితుడు రోషన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పోలీస్ అధికారి సస్పెన్షన్ సరికాదు



తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందిస్తున్న ఆందోళనకారులు

పావగడ: బెంగుళూరు నగర కమిషనర్ ఆఫ్ పోలీస్ దయానందను సస్పెండ్ చేయడం సరికాదని స్థానిక అఖిల కర్ణాటక వాల్మీకి మహాసభ నాయకుడు లోకేశ్ పాళేగార్ విమర్శించారు. విధుల్లో నిష్ఠాతుడిగా పేరు పొందిన సీపీ దయానందను సస్పెండ్ చేసి ప్రభుత్వం తప్పు చేసిందన్నారు. ప్రభుత్వ తీరుకు ఖండిస్తూ మంగళవారం తాలూకా కార్యాలయం ఎదుట రైతు సంఘం, దళిత నాయకుల ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ.. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఘటనకు పోలీసులను బాధ్యులను చేయడం భావ్యం కాదన్నారు. వెంటనే పోలీసు అధికారి దయానందపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలన్నారు. రైతు సంఘం నాయకుడు పూజారప్ప, దళిత నాయకులు డీజేఎస్ నారాయణప్ప, సీకే తిప్పేస్వామి, వళ్ళూరు నాగేశ్, వాల్మీకి సంఘం నాయకులు అంబికా రమేశ్, రంగమ్మ, ఓంకార నాయక్, భాస్కర నాయక తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో తమలపాకు రైతులు

తమలపాకు రైతులు కష్టాల్లో కూరుకుపోతున్నారు. కూలీల ధరలు పెరగడం, తమలపాకు ధరలు తగ్గిపోవడంతో నష్టాల బాట పట్టారు. గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం కావడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఎక్కడా కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు.

- తగ్గిన ధరలు.. పెరిగిన కూలి ఖర్చులు
- స్థానికంగా మార్కెట్ సౌకర్యంలేక ఇబ్బందులు
- రైతుల కష్టాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అమరాపురం వద్ద సాగులో ఉన్న తమలపాకు తోట

అమరాపురం: జిల్లాలోనే తమలపాకు తోటలకు మడకశిర నియోజకవర్గం ప్రసిద్ధి. ముఖ్యంగా అమరాపురం మండలంలో తమలపాకు తోటలపై ఎక్కువ మంది రైతులు ఆధారపడ్డారు. గుడిబండ, రొళ్ల, మడకశిర , అగళి మండలాల్లో కూడా తమలపాకు తోటలు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో తమలపాకు తోటలు ఉన్నాయి. తమలపాకును వక్కతోటల్లో రైతులు అంతరపంటగా సాగు చేస్తున్నారు. ఈ తోటలు రైతులను అంతో ఇంతో ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఈప్రాంతంలో వేరుశనగ పంటను సాగు చేసి నష్టపోయిన రైతులకు తమలపాకు తోటలు ఎంతో ఊరటనిస్తున్నాయి.

నష్టాల ఊబిలో...

ప్రస్తుతం నియోజకవర్గంలోని తమలపాకు రైతులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా తమలపాకుకు ఆశించిన స్థాయిలో ధరలేదు. గతంలో ధర రికార్డు స్థాయిలో ఉండేది. అయితే ప్రస్తుతం ధర బాగా తగ్గిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటుకావడంలేదని రైతులు వాపోతున్నారు. కూలీ ధరలు కూడా పెరగడంతో రైతులకు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెండీ ధర కేవలం రూ. వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు మాత్రమే పలుకుతోంది. దాదాపు 50 శాతం ధర తగ్గడంతో రైతులు తీవ్రంగా అష్టకష్టాలు పడుతున్నారు. దీనికితోడు తమలపాకు తోటలను సంరక్షించుకోవడం తలకు మించిన భారంగా మారింది. ప్రతి నెల తప్పకుండా తమలపాకు కోత కోయాల్సి ఉంటుంది. ఇప్పటికే కొన్ని తోటలు గత ఏడాది ఎండిపోయాయి. కూలీ ధర కూడా అధికంగా ఉంది. రోజుకు తమలపాకు కోయడానికి కూలీకి రూ.500 చెల్లిస్తున్నారు.

గిట్టుబాటు ధర ఏదీ?

కేవలం తమలపాకు పంటే కాకుండా ఉల్లి, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహాయం అందించడం లేదు. కనీసం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం నానా అవస్థలు పడుతున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



అమరాపురం మండలం నుంచి రోజూ పెద్ద ఎత్తున తమలపాకు పెండీలు మార్కెట్‌కు పోతున్నాయి. ఎక్కువగా హిందూపురం, పావగడ మార్కెట్‌కు తరలించి రైతులు అమ్ముకుంటున్నారు. కొందరు రైతులు కర్ణాటకలోని శిర, హిరియూర్, చళ్లకెర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మార్కెట్లలో దళారుల బెడద అధికంగా ఉంది. కమీషన్ ఎక్కువగా వసూలు చేస్తున్నారు. రవాణా ఖర్చులు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. అందుకే రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

– హనుమంతరాయప్ప, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

గిట్టుబాటు కావడం లేదు



మాది ఉమ్మడి కుటుంబం. మాకు ఐదెకరాల్లో వక్కతోటలో అంతర్భాగంగా తమలపాకు తోట సాగు చేశాం. తోట బాగుంది. దిగుబడి బాగానే వచ్చింది. అయితే మార్కెట్లో ధరలు లేకపోవడంతో వచ్చిన మొత్తం కూలీలకే సరిపోతోంది. ఒక పెండీ తమలపాకు కోత చేయాలంటే ఇద్దరు మనుషులు కావాలి. కోత కోసిన ఆకును పెండీ కట్టాలి. ఇందుకు ఇద్దరు అవసరం. దీంతో కూలీ ఖర్చులు ఎక్కువ వస్తోంది. గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం తమపాలకు రైతులను ఆదుకోవాలి.

– మురళీ, రైతు, గౌడనకుంట, అమరాపురం మండలం

ఉపాధికి అనుసంధానం చేయాలి



వక్క, తమలపాకు తోటలను ఉపాధి హామీ పథకం పనులకు అనుసంధానం చేయాలి. తద్వారా కూలీ డబ్బులు చెల్లించే బాధ్యత రైతులకు తప్పుతుంది. దీంతో తమలపాకు రైతులు నష్టాల నుంచి గట్టెక్కుతారు. మా ప్రాంతంలో అధికంగా తమలపాకు తోటలు సాగవుతున్నాయి. ఇక్కడ కోత చేసిన తమలపాకులను వేరే ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మాలి. దీంతో రవాణ ఖర్చులతో పాటు కమీషన్ చెల్లించాల్సి వస్తుంది. చాలా ఇబ్బందిగా ఉంది.

– తిప్పేస్వామి, మద్దనకుంట, అమరాపురం మండలం

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



చిలమత్తూరు: మహిళలు, అభం శుభం తెలియని బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నియంత్రణలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో దళిత బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం దారుణమన్నారు. ఆ ఘటనకు పాల్పడిందని టీడీపీ వాళ్లేనని తెలిసిందన్నారు. టీడీపీ నేతలు అధికార మదంతో రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని ఘటనలు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. హిందూపురం రూరల్ మండలంలోని చౌళూరులో బాలికపై జరిగిన అత్యాచార యత్నం ఘటన తనను కలచివేసిందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ఇకనైనా గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు 'పురం'లో నిరసన ర్యాలీ

చిలమత్తూరు: మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడుల నేపథ్యంలో హిందూపురంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు. జరుగుతున్న వరుస ఘటనలపై ప్రతి ఒక్క మహిళా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమానికి మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

12న ప్రతిభా పురస్కారాల ప్రదానం

మడకశిర: పట్టణంలోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో ఈనెల 12న నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాల్లో టెన్త్, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఈ ఏడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సిద్ధార్థగౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి ఎన్‌రఘువీరారెడ్డి తదితరులు ప్రతిభా పురస్కారాలను అందిస్తారన్నారు.

వృత్తి విద్యా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: మండలంలోని సేవా మందిరం ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కేటీ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. సేవా మందిరం ప్రాంగణంలో నిర్వహించనున్న శిక్షణ జూలై నుంచి ప్రారంభమవుతుందన్నారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ, రెడీమేడ్ గార్మెంట్స్ మేకింగ్, స్పైసెస్ అండ్ మసాలా పౌడర్ల తయారీ, పండ్లు, కూరగాయల ప్రోసెసింగ్, హెర్బల్ షాంపూ పౌడర్ల తయారీ, బ్యూటీషియన్ కోర్సు, బేకరీ ఐటెమ్స్, స్వీట్ల తయారీ, శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ, ఎలక్ట్రీషియన్ ట్రైనింగ్, ప్లంబింగ్ రంగంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్హతతో సంబంధం లేకుండా 18 నుంచి 55 ఏళ్ల వయసున్న స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్‌తో పాటు పరిశ్రమ స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 79891 10294, 93924 92324 నంబర్లను సంప్రదించాలన్నారు.

కౌన్సిలర్లకు కనీస గౌరవం లేదా?

- వార్డుల్లో పర్యటిస్తే అధికారులు సమాచారమివ్వకపోతే ఎలా..
- సమావేశంలో ప్రశ్నించిన కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్

పెనుకొండ: అధికారులు పట్టణంలోని ఆయా వార్డుల్లో పర్యటించే సమయంలో ఆ వార్డులోని కౌన్సిలర్‌లకు కనీస సమాచారం ఇవ్వడం లేదు. కౌన్సిలర్లకు కనీస గౌరవం లేదా? అని పలువురు కౌన్సిలర్‌లు వాపోయారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశపు భవనంలో సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు భాస్కర్‌నాయక్, తయూబ్, కోఆప్షన్ మెంబర్ వెంకటరామిరెడ్డి ప్రజల ఆశీస్సులతో గెలిచిన తమకు తమ వార్డుల్లో అధికారులు పర్యటించే సమయంలో సమాచారం ఇవ్వకపోవడంతో ఆ వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోందన్నారు. దీంతో వార్డుల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయిందన్నారు. అధికారులు తమ తీరును మార్చుకుని కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చి వార్డుల్లో పర్యటించాలన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ మాట్లాడుతూ పట్టణంలో కోతులతో పాటు కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. ప్రజలు ఇటీవల కుక్కకాట్లకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, నూతనంగా బోర్లు వేయడానికి రూ. 4 కోట్ల మేర నిధులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం వీరజవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో కమిషనర్ సతీష్‌కుమార్, వైస్ చైర్మన్ నందిని, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సద్దాం, రామాంజినేయులు, ఫర్జియాభాను, షహనాజ్, బోయ హారతి, లావణ్య, నాగరత్న, అంజలి, గీత తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మినేని' అరెస్ట్ హేయం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: 'సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు హేయం. ఆయన అరెస్టు అక్రమం' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. కూటమి ప్రభుత్వం కక్షగట్టి కొమ్మినేనిని అరెస్ట్ చేసిందన్నారు. అమరావతి మహిళలను కించపరచేవిధంగా కొమ్మినేని మాట్లాడకపోయినా కేసు నమోదు చేసి అక్రమంగా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. ఎవరో మాట్లాడిన అంశాలను సాక్షికి అంటగట్టడం సబబుకాదన్నారు. పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోందన్నారు. సాక్షి గొంతు నొక్కడానికే కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపైనే కాకుండా సాక్షి జర్నలిస్టులపై కూడా తప్పుడు కేసులు నమోదు చేయడానికి పూనుకోవడం రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పరాకాష్టకు చేరిందనడానికి నిదర్శనమని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో చంద్రబాబు, లోకేష్ రాజకీయ ముగింపు ఖాయమన్నారు. వెంటనే జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై 14 అర్జీలు అందినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ అధికారులకు సూచించారు.

యోగాతో ఆనందం, ఆరోగ్యం



లేపాక్షి: యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

పెనుకొండ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి తెలుగుతల్లి సర్కిల్, దర్గా సర్కిల్ వరకూ అధికారులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. యోగా ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. యోగాతో ఆనందం, ఆరోగ్యం సిద్ధిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్, కమిషనర్ సతీష్ కుమార్, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరెడ్డిపలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు మండలాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక నారాయణ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ నారాయణ కళాశాలలో ఇంటర్ బోర్డుకు విరుద్ధంగా కేవలంఎంపీసీ గ్రూప్‌కే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనంలోనే డ్రైవర్ మృతి

రొద్దం: మండల పరిధిలోని చెరుకూరు గ్రామ సమీపంలో బొలెరో డ్రైవర్ ఆదినారాయణ (34) వాహనంలోనే చనిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. సాలకూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ బొలెరో వాహనంలో బెంగళూరు మార్కెట్‌కు మామిడి కాయలు తరలించే వాడని తెలిపారు. అయితే సోమవారం వాహనంలోనే ఆదినారాయణ మృతి చెందడంతో పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదినారాయణ మృతిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. మృతికి గల కారణాలు విచారణలో తెలుస్తాయన్నారు. అయితే గుండెపోటుతో చనిపోయి ఉండవచ్చన్న అనుమానలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌యార్డు పాలకవర్గ సభ్యుల ప్రమాణం

మడకశిర: మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి నూతన పాలకవర్గం సభ్యులు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో నూతన పాలకవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. చైర్మన్‌గా గురుమూర్తి, వైస్ చైర్మన్‌గా శ్రీదేవి, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరి చేత మార్కెట్ యార్డు అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

హిందూపురం టౌన్: గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ గత ఏడు నెలల నుంచి గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్కర్స్‌కు జీతాలు లేక పస్తులు ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి బాబు, తాలూకా కార్యదర్శి మారుతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై గ్రామసభ

చిలమత్తూరు: మండల పరిధిలోని టేకులోడులో భూసేకరణపై ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగానే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నామన్నారు. కొందరు రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాగా, మరి కొందరు ఇవ్వమని చెప్పారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

హిందూపురం: సక్షమ్ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురం సక్షమ్ దివ్యాంగ సేవా కేంద్రంలో దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా సంఘచాలక్ రామాంజనేయులు, చిన్న పిల్లల వైద్యులు వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగులు కృషి పట్టుదలతో అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు వీల్‌చైర్లు, యూడీఐడీ గుర్తింపు కార్డులు అందజేశారు.

పురంలో దంచి కొట్టిన వర్షం



హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో కురుస్తున్న వర్షం



రైల్వేరోడ్డులో రోడ్డుపై నిల్చిన వర్షపు నీరు



అమృత్ మహల్ సమీపంలో రోడ్లపైకి చేరిన మురుగు నీరు

హిందూపురం టౌన్: పట్టణంలో సోమవారం వర్షం దంచికొట్టింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని, వాతావరణం మొత్తం చీకటిగా మారిపోయింది. భారీవర్షం కారణంగా పట్టణంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. కాలువలు ఉప్పొంగంగా.. మురికి నీరు రోడ్లపైకి చేరి తీవ్ర దుర్వాసనలు వెదజల్లాయి. పట్టణంలోని మేళాపురం సర్కిల్, బాలాజీ సర్కిల్, ధనలక్ష్మీ రోడ్డు, రైల్వే రోడ్డు తదితర ప్రాంతాల్లో మోకాళ్లలోతు నీళ్లు పారాయి. పాదచారులు, వాహనదానదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధకులు రాజు, శిరీషా రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడితో పాటు లాభాలు కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ చందన, సిబ్బంది పాల్గొన్నారు.